క్లుప్తంగా

కార్మికుల ఆందోళన



చిన్నింపేటలోని జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద బుధవారం కార్మికులు ఆందోళన చేశారు. జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల తొలగింపును నిరసిస్తూ సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ వద్ద కార్మికుల ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఫ్యాక్టరీలో పని చేస్తున్న సుమారు 80 మంది కార్మికులను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. జిల్లాలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలు కార్మికులకు ఉపాధితో పాటు ఉత్పత్తి పెంచి లాభాలు సాధిస్తుంటే ఇక్కడ యాజమాన్యం కార్మికులను తొలగించడం దారుణమన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు పాటించాలి



పాతకొట్టాంలో వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: పంచాయతీ కుళాయిలకు తాగునీటిని సరఫరా చేయడంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ సూచించారు. మండలంలోని కేపీ మల్లవరం, కేఓ అగ్రహారం, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, కోటనందూరు గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను బుధవారం ఆయన పరిశీలించారు. ట్యాంకుల వద్ద పైపులు, ట్యాంకు మూతలు సక్రమంగా ఉన్నాయా ? లేదా? ఇతర సమస్యలను తనిఖీ చేశారు. ట్యాంకులను శుభ్రపరిచిన తరువాత విధిగా మూతలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పల్లెల్లో మంచినీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుకు పెద్దపీట వేస్తున్నామన్నారు. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు



దివ్యాంగ చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో పలు వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, రోజూ చేయించాల్సిన వ్యాయామాల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు ఎం.నాగగోవిందు, ఆర్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు పుస్తకాల అందజేత



పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో గ్రంథాలయానికి పుస్తకాలు అందజేసిన ప్రసాదరావు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీకి సీబీఎస్ఈ మాజీ డైరెక్టర్ ఎంవీవీ ప్రసాదరావు పుస్తకాలు అందజేశారు. బుధవారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు చదువులో మరింతగా రాణించేందుకు గాను రూ.50 వేల విలువైన పుస్తకాలను బహూకరించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. అనంతరం ప్రసాదరావును కళాశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో పీపీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మెహర్, కళాశాల సిబ్బది పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం !

- వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు
- 18,375 హెక్టార్లలో ఖరీఫ్ సాగు
- రైతులకు అందుబాటులో విత్తనాలు



ఎన్.చామవరంలో పత్తి విత్తనాలు నాటేందుకు దుక్కు చేసిన భూమి



వి.కొత్తూరు ఆర్‌బీకేలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వేసవి దుక్కులు చేసి భూములను సిద్ధం చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పత్తి నాట్లుకు రైతులు నిరీక్షించాల్సి వస్తోంది. ఏటా రైతులు మే నెలలో దుక్కులు చేసి జూన్ మొదట వారానికి పత్తి విత్తనాలు విత్తడం పూర్తి చేస్తారు. ఈ సంవత్సరం జూన్ మూడో వారం దాటుతున్నా రైతులు పత్తి విత్తనాలు నాటడం లేదు. వర్షాభావం నెలకొనడం, అధిక ఉష్ణోగ్రతలే కారణంగా రైతులు చెబుతున్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో విత్తనాలు నాటితే భూ పొరల్లో ఉండే వేడికి విత్తనాలు మొలకెత్తవని రైతులు చెబుతున్నారు. ఆరుతడిగా సాగయ్యే పత్తికి విత్తనాలు నాటే సమయంలో కొత్త పదును ఉంటే సరిపోతుందన్నారు. అటువంటి పరిస్థితులు లేకపోవడంతో పత్తి నాట్లు వేయలేదన్నారు. రెండు దుక్కులు వర్షం కురిసి తెరిపిస్తే భూమి చల్లబడుతుందని, అప్పుడు పత్తి నాట్లు వేస్తామని రైతులు తెలిపారు.

తుని సబ్‌డివిజన్‌లో మండలాల వారీగా సాగు వివరాలు

మండలం	పత్తి (హెక్టార్లలో)	వరి (హెక్టార్లలో)	ఇతర పంటలు (హెక్టార్లలో)	మొత్తం సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
కోటనందూరు	47	3875	227	4149
తుని	769	2671	350	3790
రౌతులపూడి	765	2134	118	3017
శంఖవరం	281	1459	32	1772
తొండంగి	89	5506	52	5647

తుని సబ్‌డివిజన్ పరిధిలో..

వ్యవసాయ శాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఖరీఫ్ సాధారణ సాగు 18,375 హెక్టార్లు. ఇందులో 1951 హెక్టార్లలో పత్తి, 15,645 హెక్టార్లలో వరి, 779 హెక్టార్లలో ఇతర పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఆర్‌బీకేల్లో విత్తనాలు

ఖరీఫ్ రైతులకు అవసరమైన వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు చేరాయి. ఆర్‌జీఎల్–2537, బీపీటీ–5204, ఎంటీయూ–1064 రకం విత్తనాలు 1024 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. పత్తి విత్తనాలను ప్రైవేట్ డీలర్లు విక్రయిస్తున్నారు.

వెలవెలబోతున్న రిజర్వాయర్లు

తొలకరి ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా మెట్ట ప్రాంతంలో ఆశించినస్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో సాగునీరు అందించే పంపా, తాండవ, ఏలేరు రిజర్వాయర్లు వెలవెలబోతున్నాయి. తాండవ, ఏలేరు జలాశయాల్లో అరకొరగా నీటి నిల్వలు ఉండగా పంపా రిజర్వాయర్ ఎండిపోయింది. పుష్కర కాలువ నుంచి నీరు అందుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు కురిస్తేనే రిజర్వాయర్లలోకి నీటి నిల్వలు చేరుతాయని అధికారులు తెలిపారు.

అదును పదును చూసి నాట్లు వేయండి



రైతులు ఖరీఫ్‌లో అదును, పదును చూసుకుని పత్తి, వరి నాట్లు వేయాలి. వర్షాలు కురిస్తేనే వరినారు వేయండి. సాగునీరు అందుబాటులో ఉన్నచోట్ల రైతులు నాట్లు వేసుకోవచ్చు. నీటి వనరులు అందుబాటులో లేని రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు, చిరుధాన్యాలు, అపరాలు సాగు చేయాలి. వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలకు రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి. మొలకెత్తకపోవడం, పంట నష్టం వాటిల్లినప్పుడు కొనుగోలు బిల్లులతో నష్ట పరిహారం పొందవచ్చు. అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ సిబ్బంది అన్ని గ్రామాలు, మండలాల్లో అందుబాటులో ఉన్నారు.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు అతిథి అధ్యాపకుడు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో మాస్టర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ లేదా సమాన అర్హత గల సబ్జెక్టులో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీన అర్హత ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఇంటర్వ్యూతో పాటు సంబంధిత సబ్జెక్టులో డెమో ఇవ్వాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డెమోకు హాజరు కావాలని సూచించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలి



గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ లతా కుమారి

గండేపల్లి: పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ఆదేశించారు. గండేపల్లి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



కొత్త సూరవరంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు.



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

తుని రూరల్: మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులు సామూహిక సీమంతాలు చేశారు. కొత్త సూరవరంలో జరిగిన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.రమణమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పలువురు చిన్నారులకు అన్న ప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకున్నప్పుడే శిశువులు ఆరోగ్యంతో జన్మించి, తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా భావించరాదన్నారు. బాలికల చదువు భవితకు వెలుగును ఇస్తుందన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాత ఆడపిల్లలకు, 21 ఏళ్లు నిండిన తర్వాత మగ పిల్లలకు పెళ్లిళ్లు చేయాలన్నారు. బాలికల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అన్నిరంగాల్లో బాలికలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. పోషకాహారం ఆవశ్యకతను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డయేరియాను దరిచేరనివ్వొద్దు

- ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము
- తునిలో మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము

తుని రూరల్: మండలంలో డయేరియాను దరిచేరనివ్వొద్దని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ప్రగతిపై ఎంపీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి, సంక్షేమానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా డయేరియా, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిస్థితులకు అనువుగా గ్రామీణుల జీవనం సాగించడంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. ఆయా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యవంతులను చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులు, వ్యాధుల పట్ల గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని తేటగుంట, ఎన్.సూరవరం పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం, అపరిశుభ్రత నెలకొంటే తనకు నేరుగా ఫిర్యాదు చేస్తే సమస్యలను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ డీఈఈ ఎ.శివాజీ సభ్యులకు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రత, రక్షితనీరు వాడకంపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. నిధులు మంజూరులో జాప్యంతో జల్ జీవన్ మిషన్ పనులు కొంత ఆలస్యమవుతున్నాయని తెలిపారు. విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ఎస్.అన్నవరం, లోవకొత్తూరు, కొలిమేరు, ఎన్.సూరవరం సర్పంచులు కోరారు. అనంతరం విద్య, వైద్యం, ఐసీడీఎస్, ట్రాన్స్‌కో, వ్యవసాయం, రెవెన్యూ, తదితర శాఖల పనితీరుపై ఎంపీపీ సమీక్షించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, వైస్ ఎంపీపీలు చిటికెల సత్యవతి, బోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, ఎంపీడీఓ రవి కుమార్, తహసీల్దార్ భరత్‌రెడ్డి, ఎస్ఐ రమేష్ బాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న స్వరూప్

తుని రూరల్: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అమరావతి కోఆపరేటివ్ సొసైటీ (క్యాజీ బ్యాంకు) ఆధ్వర్యంలో బుధవారం స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. తుని క్యాజీ బ్యాంకు బ్రాంచి ఆవరణలో డాక్టర్ కుప్పిలి ఆదినారాయణ పట్నాయక్ మెమోరియల్ సొసైటీ ద్వారా పదిలో ప్రతిభ చూపిన మంది విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్లు అందజేశారు. స్కాలర్ షిప్‌లను అందజేసిన ఆది స్వరూప్ గ్రూపు కంపెనీల చైర్మన్ ఆదిస్వరూప్ మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులు మరింత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. బ్యాంకు చైర్మన్ రామలక్ష్మి స్వరూప్, వైస్ చైర్మన్ సురేష్ సబ్బాని, ఈడీ భార్గవ్, జీఎం నాగేశ్వరరావు, ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి శాతకర్ణి పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

- డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహ నాయక్
- డయేరియా రోగులకు పరామర్శ



బెండపూడిలో పర్యటించి అధికారులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్



బాధితులకు పరామర్శించిన వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు తదితరులు

తొండంగి: మండలంలోని బెండపూడిలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో రక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహనాయక్ తెలిపారు. రావికంపాడు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులను బుధవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహ నాయక్ పరామర్శించారు. అనంతరం బెండపూడి ఎస్సీపేట, బీసీకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. డయేరియా ప్రభావిత ప్రాంతాలకు ప్రస్తుతం సరఫరా అవుతున్న తాగునీటిని నిలుపుదల చేసి ప్రత్యేకంగా ట్యాంకుల ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మంగళవారం నమోదైన 18 కేసుల్లో 10 కేసులు డయేరియా బాధితులుగా గుర్తించామన్నారు. కాగా బుధవారం కూడా మరో మూడు డయేరియా కేసులు నమోదైనట్టు తెలిపారు. అనారోగ్యానికి గురైన వారిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నామన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాల్లో నిల్వ మాంసాహార విక్రయాలు, కలుషిత ఆహార పదార్థాలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సరిత, రావికంపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అర్చన, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

బాధితులను పరామర్శించిన వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

తొండంగి: మండలంలోని బెండపూడిలో డయేరియా బాధితులను వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు బుధవారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సూచనల మేరకు బెండపూడిలోని డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకులు మద్దుకూరి వీరవెంకట సత్యనారాయణ(పెద్దబ్బు), గాబు రాజు, ఆరుమిల్లి ఏసుబాబు, దడాల విజయబాబు, మురాలశెట్టి సత్తిబాబు, పేకేటి హరికృష్ణ, కటకం ఈశ్వరరావు, బూసాల గణపతి తదితరులు ఉన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలని వినతి



పార్కు అభివృద్ధిపై కమిషనర్‌తో మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పిఠాపురం: పట్టణంలోని ఉప్పాడ సెంటర్లో ఉన్న పురాతన చిన్నమాంబ పార్కును అభివృద్ధి చేయాలని పిఠాపురం వాకర్స్ క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం వాకర్స్ క్లబ్ సభ్యులు పార్కు బుధవారం చిన్నమాంబ పార్కులో మున్సిపల్ కమిషనర్ కనకారావును కలశారు. పార్కు అభివృద్ధిపై అయనకు పలు సూచనలు చేశారు. ఎన్నో ఏళ్లుగా పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సేదదీరడానికి వసతి సౌకర్యాలతో పార్కు ఉండేదన్నారు. కాలక్రమేణా ఆక్రమణలకు గురై పార్కు అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. దీంతో కనీసం కూర్చోడానికి కూడా స్థలం లేక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎంతో చరిత్ర కలిగిన పార్కును అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ధాన్యం సొమ్ము కోసం ఎదురుచూపులు

- వెంటనే చెల్లించాలని రైతుల డిమాండ్



వేట్లపాలెంలో ధాన్యం తరలిస్తున్న రైతులు (ఫైల్)

సామర్లకోట: రబీ ధాన్యం విక్రయించిన సొమ్ముల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల ముగిసిన రబీలో అనేక మంది రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లులకు విక్రయించారు. రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకూ ధాన్యం సొమ్ములు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని రైతులు వాపోతున్నారు. రైతులు ఒక పంట ద్వారా వచ్చిన ఆదాయాన్ని మరో పంటకు పెట్టుబడిగా పెడతారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు ప్రారంభం అయ్యాయి. ఇలాంటి తరుణంలో చేతిలో సొమ్ములు లేక రైతులు తొలకరి సాగు పెట్టుబడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీకి ముందు విక్రయించిన రైతుల బాపతు ధాన్యం సొమ్ము నాలుగు రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాలకు జమ అయ్యింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యాక, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు రైతుల బ్యాంకు ఖాతాలో జమ కావలసిన మొత్తాలను నిలుపుదల చేశారు. ఒక్క పీబీ దేవం గ్రామంలోనే వెయ్యి క్వింటాళ్ల ధాన్యం బాపతు సొమ్ము రైతుల ఖాతాలకు జమ కావలసి ఉంది. తమకు రావలసిన ధాన్యం సొమ్మును వెంటనే చెల్లించాలని వీకే రాయపురం, జి.మేడపాడు, పీబీ దేవం గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. సామర్లకోట మండలంలో 200 మంది రైతులకు చెందిన సుమారు 12 వేల క్వింటాళ్ల ధాన్యం సొమ్ము వారి ఖాతాలకు జమ కావాల్సి ఉందని సొసైటీ మాజీ అధ్యక్షుడు మలకల వరహాల బాబు తెలిపారు. తమ ఆర్థిక అవసరాల రీత్యా ధాన్యం సొమ్మును వెంటనే జమ చేసేలా అధికారులు చూడాలని రైతులు కోరుతున్నారు. పెట్టుబడి సొమ్ము లేకపోవడంతో అనేక మంది రైతులు ప్రస్తుత ఖరీఫ్ దమ్ములు కూడా ప్రారంభించలేదని వరహాలబాబు తెలిపారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఐ.సత్యను 'సాక్షి' వివరణ కోరింది. ధాన్యం సొమ్ము బకాయిల విషయాన్ని పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకు వెళ్లినట్టు బదులిచ్చారు.

ప్రత్తిపాడులో సీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది

ప్రత్తిపాడు: ప్రపంచ సికిల్ సెల్ డే సందర్భంగా ప్రత్తిపాడులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సిబ్బంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరిటెండెంట్ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ సికిల్ సెల్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులను వివరించారు. సీహెచ్‌సీ వద్ద ర్యాలీని డాక్టర్ సౌమ్య ప్రారంభించారు. ర్యాలీలో సీహెచ్‌సీ సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

పెద్దాపురం: సామర్లకోట రాక్ సిరామిక్ పరిశ్రమలో తొలగించి కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు కోరారు. సీఐటీయూ నాయకుడు డి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బుధవారం తొలగించిన కార్మికులు పెద్దాపురం క్యాంపు కార్యాలయంలో తుమ్మల బాబును కలసి సమస్యను వివరించారు. దీంతో తుమ్మల బాబు ఏలూరు కార్మిక శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేకుంటే కలెక్టర్ దృష్టిలో ఉంచి కార్మికుల వెంట సమస్య పరిష్కారానికి పోరాడాతమన్నారు.

సత్యదేవుని దర్శించిన జిల్లా ఎస్పీ దంపతులు

అన్నవరం: కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ వెంట పలువురు పోలీస్ అధికారులు ఉన్నారు.



ఎస్పీ సతీష్ కుమార్ దంపతులకు సత్యదేవుని ఫొటో అందజేస్తున్న అధికారులు

పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి



జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్యవైశ్యం సంఘం సభ్యులు

జగ్గంపేట: నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ఆర్యవైశ్యులు కృషి చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. గండేపల్లి మండలంలోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు బుధవారం ఎమ్మెల్యే నెహ్రూను కలిశారు. సంఘ అధ్యక్షుడు కొత్త చిన్న వీరభద్రరావు (శివ) ఆధ్వర్యంలో జగ్గంపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జ్యోతుల నెహ్రూను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలన్నారు. దీనిలో భాగంగా పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి కావలసిన సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కాకినాడ జిల్లా అధ్యక్షుడు గ్రంధి నగసుబ్రహ్మణ్యం, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మీసేవ ఆపరేటర్ల వినతి

నియోజకవర్గంలో మీ సేవ కేంద్రాలను పునరుద్ధరించాలని మీసేవ ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు బుధవారం జగ్గంపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జ్యోతుల నెహ్రూను కలసి వినతి పత్రం సమర్పించారు. అలాగే పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు జ్యోతుల నెహ్రూను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.